# యేసు క్రీస్తు ప్రభు శతకము

(సెప్టెంబరు 1945)

(సి.ఎల్.ఎస్.వారు 1953లో ముద్రించినది.)

శా॥ శ్రీ రాజిల్లు భవత్పదాబ్జములు నా చిత్తంబులో నిల్పినీ,
కారుణ్యామృత బిందు బృందములు వేడ్కల్మీరగ జిల్కి,
దుర్వార స్వాంత దురంతతాపమును దీరన్ శాంతి బొందించి యీ
వే రక్షణ్యము నా నుతుల్ వినగరావే యేసుక్రీస్తు ప్రభో 1

శా॥ పాండిత్యం బెరుగంగనేరని మహా పాపాత్మునజ్ఞాను పా
షండున్ నన్ను వివేకమిచ్చి దయతో స్వాంతంబు కన్విప్పి నీ
యండంజేరిచి నేర్పు వాక్కులు మనోహస్తంబులగుచ్చి పూ
దండల్ గానిదె పూజసేతు తవ పాదం యేసు క్రీస్తు ప్రభో 2

అరుణాభ్జాంతరమైన తేనియల పానాసక్తిచే చొక్కుసుం
దర మత్తాళి విధంబునన్ గళిత రక్తస్తంభ శుంభద్భువ
చ్చరణాబ్జంబులలోని గాయముల పొంతంబోయి నా చిత్తమున్
పరమానంద రసంబు గ్రోలుగద దేవా యేసుక్రీస్తుప్రభో 3

మ॥। నది యంభోనిధి బాయలేని గతి నీ నామామృతంబాను నా
యెద నీ పాద పయోజముల్ దినము సేవింపన్ వడిన్ ఈడ్చుమో
సదయాంతః కరణా యఘాపహరణా సత్రైస్తవోద్ధారణా
మదికిన్నెమ్మది నిచ్చినన్ మనుపరమ్మా యేసుక్రీస్తు ప్రభో 4

మ॥ దురితారణ్య దవాగ్నియై సుజనచేతోమోద బోధస్ఫుర
ద్వరదీపాంకురమై పిశాచ మద గర్వాధ్వాంత మార్తాండచం
డ రుచి ప్రస్ఫుటమై వెలుంగు తవ దార్ఢ్యంబైన వాక్యంబు నా
యరి బృందంబు దొలంగగా నొసగుమయ్యా యేసుక్రీస్తు ప్రభో 5

శా॥ చేతో దుఃఖము బాపు శాంతమిడు దుశ్చింతాలతల్ ద్రుంచు ని
ర్భీతి ప్రేమయు ధైర్యమిచ్చు నఘముల్ భేదించు భావార్థముల్
మూతల్విప్పును సంశయాంధ తమముంబోగొట్టు నీ వాక్యముల్
బ్రీతిన్ నమ్మిన వారి కెల్లపుడు ధాత్రిన్ యేసుక్రీస్తు ప్రభో 6

శా॥ వాతో ధ్ధూతముచేత దుర్దిన ఘన ప్రచ్ఛన్నముంబాసి ఖ
ద్యోతుండంబర వీధి చండతర దీప్తుండౌచు గన్పట్టు నా
రీతి న్నీ కరుణా మహానిలము ప్రేరేపించి మత్పాపజీ
మూతంబుం దొలగించి యాత్మ వెలుగిమ్మో యేసుక్రీస్తు ప్రభో 7

మ॥ దురితారంభము వేళ తెల్విగాని దోడ్తోతత్స్వబావోద్భవాం
కురముల్ నీ శుభవాక్య దాత్రమున వేగోయంగలేకున్న బం
ధుర శాఖాలత పత్ర పుష్ప ఫల సందోహఘ దుర్వృక్షముం
బెరుగున్ దానిని గూల్ప మానసితరంబే యేసుక్రీస్తు ప్రభో 8

శా॥ మాయాజాలములోన జిక్కువడి సన్మార్గంబు వోగొట్టి సు
శ్రేయాసక్తి పరిత్యజించి నిరత స్వేచ్ఛాను సంచారినై
నీ యాధీనముగాని పెక్కుదినముల్ నే బుచ్చితిన్ పాపమో
దాయత్తైక మనంబు వెంటఁ జనితయ్యా యేసుక్రీస్తు ప్రభో 9

శా॥ వారింపం దరిలేని యింద్రియ గుణ వ్యాపారమౌ నేరులం
బూరింపం బదరాని తృష్ణయను నంభోరాసిలో జొచ్చి చే
బారల్వేయుచు నీఁది యీఁది తుద లాభం బొక్కగవ్వైనకం
ట్నారం గంటినె గాలి మూట గడితయ్యా యేసుక్రీస్తు ప్రభో 10

శా॥ పాపాత్ముల్ భువి లేరె నా కొలది దుష్పాపుల్ మహీమండల
ద్వీపాంతంబుల లోపలం గలరె పందెం బొగ్గి యిట్లొక్కనిం
జూపింపంగలవారు లేరిల మహాచోద్యంబు నీ వస్మదీ
యావత్పాప భరంబు పోదు నిమితయ్యా యేసుక్రీస్తు ప్రభో 11

మ॥ పదివేల్ నాలుకలైన జాలవిక నా పాపంబులెన్నంగ నీ
మృదుపాదక్షత రక్తపుణ్యమహిమా విస్తారమున్ లెక్క సే
య దివిక్ష్మాజల సర్వజీవముల జిహ్వాల్ చాలునే యిట్టి నీ
పదమే యాస్పదమంచు జేరితిని దేవా యేసుక్రీస్తు ప్రభో 12

మ॥ అరికాల్ నుంచి శిరోపరిస్థలము పర్యంతంబు సర్వాంగముం
బరిశోధించిన లోపలన్ వెలపలన్ పాపంబులేనట్టి చో
టు రవంతైనను గానవచ్చునె పటాటోపంబు పేరే సుమీ
నర రూపుం గొనునేనెదుర్నరకి నన్నా యేసుక్రీస్తు ప్రభో 13

మ॥ పెరుగుంగయ్యము గవ్వగాని పనికై భ్రూయుగ్మముల్ వంకలై
యెరుపౌ గన్నులు కొల్మితిత్తుల గతిన్ వేండ్రంబుగా నాసికాం
తర నిశ్వాసము లొప్పు క్రోధహుత భుక్తప్తాంగమౌ నిట్టి దు,
ర్నరుడన్ నారక భూతరూపమయి తన్నా యేసుక్రీస్తు ప్రభో 14

శా॥ పాపాత్ముండను పాపకర్ముడను దుర్భాగ్యుండనే మూర్ఖదు
ర్వ్యాపారుండను కామక్రోధమదగర్వ క్రూరచిత్తుండ సం
తాప స్వాంతుడ నిన్ను జేరితిన్ నన్ దన్నేసినంబోను నీ
తో పోరాడెదగాక దిక్కుమరిలేదో యేసుక్రీస్తు ప్రభో 15

మ॥ ఒకమారా పలుమార్లు నేనెరిగి పాపోగ్రాహిదష్ట్రాంకుర
ప్రకటంబైన విషాగ్ని కీలల వెసన్ బానంబుగావించి యా
త్మను దుర్మృత్యువు వాతబెట్టితని నా తప్పెంతువో పెంతువో
యిక నీవే గతిబెట్టు నిన్విడువ జుమ్మా యేసుక్రీస్తు ప్రభో 16

శా॥ కాల వ్యాళ విషాగ్ని కీల కులటా కంజాక్షివాల్ జూపులం
గ్రోలంబోయెడి చక్షురింద్రియముపై కుంతంబుతో గ్రుచ్చినన్
మేలౌనో నరులార మీరలటు బల్మిన్ బోకుడీయంచు న
న్నాలోకింపగ సాక్షిగన్పరతునయ్యా యేసుక్రీస్తు ప్రభో 17

శా॥ గర్వాంధంబున కన్నుగానక బలాత్కారంబునం మా
సర్వజ్ఞుండగు తండ్రి కట్టెదుర నిశ్శంకన్ మహా పాపమున్
సర్వాపేక్షల జేసినావు ఇక నీ సాంగత్య మింతయ్యేనే
నుర్విన్ సజ్జన నిందితుండనయి తయ్యో యేసుక్రీస్తు ప్రభో 18

మ॥ పటుదావాగ్ని నికాలియున్న మొరదున్ పంథానమందుండి చీ
కటివేళం జనువారికిన్ భయదమై గన్పించు చందంబునన్
కటుతిక్తాంతర పాపసర్ప విషదగ్ధ ప్రాణినైయున్న యే
నటు లైతిన్ సుజనాళి చూపులకునయ్యా యేసుక్రీస్తు ప్రభో 19

శా॥ నా పాపంబొక కుంచమైన తవ పుణ్యం బొప్పు బానంతయై
కూపంబైన తటాకమౌను మమ దుష్కృత్యంబు నీ పుణ్యము
న్వేబారనది బోలు నా దురితమున్నీ పుణ్యమం బోనిధై
యాపున్ ఎంతనవచ్చు నీ సుకృత మాహా యేసు క్రీస్తు ప్రభో 20

శా॥ నా కన్నంగడుపాప కర్ముడొకడై నన్ లేడు భూమండలిన్
నీ కన్నం బ్రియ రక్షకుండెచట నన్వేషించినన్ లేడికన్
నాకున్నీకును జోడుగూడెగద నన్నుంబ్రోవు మిట్లైనము
ల్లోకంబుల్ నిను మెచ్చు నీ బిరుదు నిల్చున్ యేసు క్రీస్తు ప్రభో 21

మ॥ నను బుట్టించిన విశ్వకర్త నకలాంతర్యామి నాద్యంతశూ
న్యుని సర్వజ్ఞుని నిర్వికారు పరిపూర్ణున్ నిత్యునాకాశ రా
జ్యనివాసోన్నతు దేవునిం దలచి నా స్వాంతంబునం గొల్తు గ్ర
న్నన నా దుష్కృతముల్ క్షమించుమని యన్నా యేసుక్రీస్తు ప్రభో 22

మ॥ తరణిం జీకటులివ్వ వేడుగతి శీతం బగ్నిచోగురు వే
దురు చందంబున దుష్టవాంఛలను సంతోషింప నాబోటి దు
ర్నరులుం దేవుని వేఁడబోదు రెద పూర్ణ భ్రాంతులై యాపరా
త్పరుపై పాపము మోప దుర్గతులురావా యేసుక్రీస్తు ప్రభో 23

మ॥ కడుపారం గనుకున్న బిడ్డలెడ నే కాలంబునం దెట్లు, పా
ల్గుడుపంబోలునో యేది యవసరమో తల్లుల్ వేడ్కతో నియ్యనే
తడవున్ చేయరు అట్ల నా యవసరాల్ తత్కాలమందిచ్చి నా
యిడుమల్బాపెడు తండ్రినిందలతు పేర్మిన్ యేసుక్రీస్తు ప్రభో 24

మ॥ పుడమీ మృత్తిక కుంచమందు నిడి యంబోరాశి నీరంబులన్
పుడిసెల్గా నొక జేనలోన గగనంబున్ గొల్చియుం ద్రాసులో
పడిరాళ్ళట్లు మహామహీధరము లొప్పంబెట్టి తూఁచంగ నె
వ్వడు సామర్థ్యుడా వాని గొల్గునెద దేవా యేసుక్రీస్తు ప్రభో 25

మ॥ జగతీమండల మావగింజవలెనే సర్వేశు దృగ్దృష్టిలో
నగుపించున్ మరి దీనిలోన మమదేహం బెంత యేనెంత నా
దగుకాలంబది యెంతరేణువణువుం దర్భాగమున్ లేని నే
నొగి నిన్నెట్లు నుతింతు నెట్లెరుగనేర్తో యేసుక్రీస్తు ప్రభో 26

మ॥ పరమార్థం బెరిగించు వాక్యముల తాత్పర్యంబు బోధించు ని
ష్ఠురచిత్తంబు మృదుత్వమున్నెరపు తాటోటెల్ల పోగొట్టునా
పరిశుద్ధాత్ముడు నన్ను బాసెనకటా పాపాగ్ని కీల్మదిం
బెరసన్నెమ్మది బోయి దుఃఖములు గ్రమ్మెన్ యేసుక్రీస్తు ప్రభో 27

మ॥ అకటా నన్విడనాడలేక పరిశుద్ధాత్ముండు దుఃఖంబుతో
నిక చాలించుము పాపము న్విడువుమంచేవేళ బోధింప నా
వికటోన్మాదము మాననైతి చెవికి న్విన్నించుకోనైతినా
యొక కాఠిన్యమనంబు కేమనుదునయ్యో యేసుక్రీస్తు ప్రభో 28

మ॥ ఆనందామృత వార్ధి వీచికల నుయ్యాలుఁగుచో నిర్మల
జ్ఞానధ్యాన వివేకనూన రసమిచ్చున్మెచ్చుచుం గ్రోలుచో
హా నీవిప్పుడు నన్ను బాసి పరిశుద్ధాత్మా కదుం దూర మీ
వైనావాయని బల్కియేడ్తుమదినయ్యా యేసుక్రీస్తు ప్రభో 29

మ॥ పరిశుద్ధాత్మ విశుద్ధ తత్వ గృహధర్మ ద్వారమామోక్ష పా
పురమా తెల్వుల పూరమా విమల సరోదార కాసారమా
వరభక్తాత్మ విచారమా పరమదివ్య జ్ఞానమూలంబ నా
దురితం బెల్ల క్షమింపవే యని నుతింతున్ యేసుక్రీస్తు ప్రభో 30

మ॥ అరిషడ్వర్గ మణంప నింద్రియ దురంతాసక్తి ఖండింప దు
స్తర మాయా పటలంబు వోదరమ భక్తవ్రాతము న్మెచ్చనా
దురితాంధంబగు కన్నువిప్పి మది సంతుష్టియ్య రావయ్య యో
పరిశుద్ధాత్మ యటుంచు బిల్చెదను దేవా యేసుక్రీస్తుప్రభో 31

శా॥ దారావృష్టిని నిర్మలోదకము లిద్ధాత్రీ స్థలింబారి వి
స్తారంబౌ మలినంబులుం గడిగి యంతన్నొక్కచో నిల్చియుం
దేరున్నట్టుల నా మనో మలినముం దీరంగ శుద్ధాత్మ నా
పై రా నీవె సుధాప్రవర్ష మెద నింపన్ యేసుక్రీస్తు ప్రభో 32

మ॥ జనకుండాత్మజు డాత్మత్రైకుడ వనుచున్ స్వాభావ మంధైక్యముం
ఘనకార్యంబుల ముప్వురంచు తన వాక్యంబుల్ప్ర బోధించు దే
వునికి న్నీకును జ్ఞానధర్మముల తావుల్ జూపు శుద్ధాత్మకున్
ఒనరంగన్, గుణభేద భావములు లేవో యేసుక్రీస్తు ప్రభో 33

శా॥ పాలన్ముంచిన నీళ్ళముంచిన భవత్పాందంబులే దిక్కుగా
నీలేదొండొక చోటనా తలపిక న్నీవంటి సద్రక్షకుం
డేలోకంబున లేడటంచు మది నేనే ప్రొద్దు వర్ణింతు నిం
కేల యాలిశమయ్య నన్మనుప రావే యేసుక్రీస్తు ప్రభో 34

శా॥ రావే నా మొర లాలకించుటకు ధైర్యం బిచ్చి రక్షింపవే
లేవే నామది పెక్కు దుఃఖముల యేర్లింకించి నా విన్నపాల్
తేవే చిత్తమునందు వందనము లర్థింజేతు మోక్షార్థముల్
ఈవే నా మది నిన్ను నమ్మితిని జుమ్మీ యేసుక్రీస్తు ప్రభో 35

శా॥ లేదో నీ దయ దాసిగాని మన వాలించాపదల్బాపగా
రాదో రేబగలార్త నాదమున జేరం జీరు దారిద్రుతో
వాదో లేక పరీక్ష చెల్లుగని బ్రోవన్ వేళ సామీప్యముం
గాదో నా బలిమేను నీ కరుణ గాకన్ యేసుక్రీస్తు ప్రభో 36

మ॥ బరువో నా దురితంబు లానుటకు నాపై నీ కటాక్షం బిడన్
కరువో నా కనుగొల్కులం దొలుకు బల్ కన్నీళ్ళ నీరాడనీ
చెరువో కల్వరిమెట్టపై రుధిరముంజిందించి మేనిచ్చుటల్
అరువో రొక్కమొ దెల్పక న్విడువనయ్యా యేసుక్రీస్తు ప్రభో 37

శా॥ నా శోక ధ్వని వీనులం బడదటన్నా దుఃఖవారాశిలో
భాసిల్లే నను దీనుగాచుటది తప్పా లేక నీయందు వి
శ్వసించే మది లేని సాక్షి గనినావా జాలమింకేల నీ
యాశీర్వాదములిచ్చి నన్మనుపవయ్యా యేసుక్రీస్తు ప్రభో 38

శా॥ మేలా దీనునిపట్ల నిష్ఠురత పేర్మిం జూచి యోదార్చ రా
వేలా నీ పదపద్మముల్ గొలుచుచున్ విశ్వాసినై యుంటకుం
చాలా కోరుదు నింతకంటె మరి సౌఖ్యం బెద్దియే నింక నొం
డేలా వేడగా ముక్తి నీవె గద తండ్రీ యేసుక్రీస్తు ప్రభో 39

శా॥ కన్నుల్ తేజముదప్పి రేలు బగలుం గారేటి నీరంబులె
న్నెన్నో నీ కొలలోన నుంచి యిపుడీ నృత్యంబుగా జూచుటల్
చన్నే నిన్నటి నేటి ప్రేమలొకొ నా జన్మాదిలోనెంచి నా
వన్నాయే నినునీవు నన్నెరుగుదయ్యా యేసుక్రీస్తు ప్రభో 40

మ॥ నను పో పొమ్మన లేవు అంటివె భవన్నామ కృపాసత్య వ
ర్తనలేమాయెను వాదురాదె యిక నోర్వంజాల నా పాపమెం
చిన నీ వాగ్దయలెంతు నేను నను బ్రోచే రక్తసిక్తాశ్రితా
వనపాదంబులు జూపక న్విడను దేవా యేసుక్రీస్తు ప్రభో 41

శా॥ జాలం బేటికి జేతువన్న యిదె సంసారోగ్ర దావానల
జ్వాలల్ పెంకొని గ్రమ్మె దుస్తర మనస్తాపంబు వాటిల్లెనా
పాలింటం గడు శత్రువయ్యెను స్వభావంబింక నావంక నీ
వాలోకింపగదయ్య నెయ్యమున నయ్యా యేసుక్రీస్తు ప్రభో 42

శా॥ మోక్షాంతర్వర సౌధ మంటప సభా ముఖ్యుండవౌ నీవు నా
పక్షంబై కరమెత్తి యార్తుడగు నిప్పాపాత్ము రక్షింతు నా
దక్షత్వం బిదియంచు బల్కిన భవత్సబ్యుల్ నివారింతురే
యాక్షేపింతురే యెందుకీ తడవులయ్యా యేసుక్రీస్తు ప్రభో 43

శా॥ అపోస్తల్మరి దీర్ఘ దర్శులును నిత్యాత్మల్ మహాదూతలు
న్మాపుల్ రేపులు లేని శోభిత సభా మధ్యంబునం గొల్వశ్రే
యోపీఠంబున నీవు నిత్య సుఖివై యుండంగ నా తాపము
ల్వాపోవుల్ దెగునట్లు రావె కరుణింపన్ యేసుక్రీస్తు ప్రభో 44

శా॥ నిత్యానందము పూర్ణశాంత రసము న్నిరైశ్వర్యమున్ శాస్త్రసాం
గత్యం బాత్మ కొసంగవే యనుచు వేడ్కన్నిన్ను బ్రార్థింతు నీ
భృత్యశ్రేణులలోన నన్నొకనిగా వీక్షించి రక్షించి నా
భత్యం బియ్యవె నెమ్మనం బదియె దేవా యేసుక్రీస్తు ప్రభో 45

శా॥ ఎన్నాళ్ళీ ధరమీదనున్న నను నీ యంఘ్రిద్వయీ భక్తిసం
పన్నుంగా నొనరించు మా పయిని చావంబోవు కాలబునం
దెన్నన్‌బాని ముదంబొసంగు మటపై నేమిచ్చెదో దెల్పలే
నన్నా యావలిదియ్య నీ వెరుగు దయ్యా యేసుక్రీస్తు ప్రభో 46

మ॥ మనసే మానస మర్మసాక్షియగు భూమానుష్యులుందూతలుం
గనుకోలే రటువంటి మానసము నిష్కాపట్యముంజేయనే
మనుజుం డొపడటంచు శాస్త్రమును ప్రామాణ్యంబుగా జెప్పు మ
న్మనసాంతర్గత కల్మషం బణచుమన్నా యేసుక్రీస్తు ప్రభో 47

మ॥ తెలివై యుండియు నిద్రబోవు నరునిం దెల్పంగ నిద్దారుణీ
తలమందేరికి శక్యమే యిటులనే తప్పొప్పులుం బుద్దిలో
తెలిసే తెల్వినినుండి పావ తమసా ధీనుండనై మిత్తివా
కిలిలోకున్కితి లేపినావు తవశక్తిన్ యేసుక్రీస్తు ప్రభో 48

శా॥ కన్నా సంజని గుడ్లపై నొదిగి రెక్కల్మాసి బల్ ప్రేమానాఁ
కొన్నన్ ఎందునుబోక కుక్కుటముపై గూర్చుండు నా రీతినా
పన్ను న్నన్ను భవద్దయా ప్రియములొప్పంజూచి నీ రెక్కచా
యన్నన్నెప్పుడు దాఁచి బ్రోవగదె దేవా యేసుక్రీస్తు ప్రభో 49

మ॥ హరిదశ్వం డొక జ్యోతి రింగణముపై నత్యుగ్రత జూడనా
పురువేమైన నెదుర్కొనం గలదె పాపుందీనునిన్ నన్ను నీ
కరముంభారముగా శిరంబుపయి నల్కన్ బెట్టినన్ ఓర్వ నా
తరమే నా ప్రతివాదినే కరుణ రాదా యేసుక్రీస్తు ప్రభో 50

శా॥ ఓ దాహాతురులారా నా కడకు రారో వాక్యముంద్రావుడా
మీదన్ తేనియాలూరు నేరుగడు తాల్మిన్ బారు మీ లోననే
నీ దివ్యోక్తుల భావమెంచి మది నెంతేనిం తృష్ణాత్ముండనై
నీ దాపున్ గని జేరితిన్ కరుణరానీ యేసుక్రీస్తుప్రభో 51

మ॥ అణుమాత్రంబు భవత్కృపాబలము నా కందిచ్చినన్ చిత్త దు
ర్గుణముం ద్రుంతు పిశాచదుర్నయ రణత్కోదండ టంకార దు
ర్గుణముం ద్రుంచెద పాప దుష్ఫల మనోవృక్షంబు గూలంగతత్
క్షణముంద్రుంచెద నీ జయోన్నతులు హెచ్చున్ యేసుక్రీస్తు ప్రభో 52

మ॥ ఇల దావీదను రాజుతొల్లి కృపచే నేర్పడ్డవాడై ననుం
బలు పాపంబున బడ్డ దేవుడు దయన్ మన్నించి కాపాడి ని
శ్చలసద్భక్తి యొసంగిలేపె నిపుడా చందంబు నన్నీవు నా
బలవత్పాప మణంచి యెత్తుటకు రమ్మా యేసుక్రీస్తు ప్రభో 53

శా॥ నీతో చచ్చెదనంచు పేతురుడు నిర్ణీతుండునై వెన్క హృ
ద్భీతిన్ బొంకెను పాపముందెలుపు నీ దృగ్దృష్ఠి జూపించినం
జేతో దుఃఖముబొంది నిన్ననుసరించెన్ మరణపర్యంతమా
రీతిన్ నాదురితంబు బాపి దయ నీవే యేసుక్రీస్తు ప్రభో 54

శా॥ ఏకాలంబుల నాటి చుట్టములు నీ కెన్నంగ నా లాజరుం
డాకంజాయత నేత్రయౌ మరియ యింకా పౌలసాచోరుడున్
లోక ఖ్యాతిగ నెంచి వారిని దయాళుత్వంబుతో బ్రోచినా
వీకాలంబున నన్ను బ్రోచుటకు రావే యేసుక్రీస్తు ప్రభో 55

మ॥ ఒడయా నీ దయచేత నెంచిన మనుష్యం డేడేడు మార్లాపదం
బడినం దోడనే లేచు త్యక్తుడొక తేపన్ బడ్డవాడింక నె
న్నడు లేవండని బల్కు వాక్యమిదిగో నా పట్ల నీడేరెనా
పడుటల్ నీ కృప నెత్తుటల్గలిగెదేవా యేసుక్రీస్తుప్రభో 56

మ॥ తలిదండ్రుల్ తమ ముద్దు కుర్రల యెడం దప్పుండినన్ తాడనం
బులు పైకెత్తురు చిత్తముల్ కరుణతో పూర్ణంబుగా నుంతురా
వలెనే నా బలు తప్పులుంగని దయా భావంబులోనుంచి వె
ల్పల దండించితివిందు మేల్గలిగెనప్పా యేసుక్రీస్తు ప్రభో 57

శా॥ పాపం బెచ్చుట విస్తరించెనో కృపా బాహుళ్యమచ్చోట ను
ద్దీపించెన్ మరి యేరికైన కలుషాధిక్యంబు మన్నింతువో
నీపై వారల ప్రేమ యెక్కువగు వర్ణింపంగ నీ వాక్యముల్
జూపట్టెన్ మును మరియచో నిపుడు నాచో యేసుక్రీస్తు ప్రభో 58

మ॥ మరియా సూనుడు వడ్లవాని సుతుడీ మానుష్యుడు న్వీని సో
దరులున్నారిదె వీనికిట్టి పరమార్థజ్ఞాన మెట్లబ్బెనం
చరుదొంచదే నరకోటిలో దిరుగు మోక్షనంద దాయీ పరా
త్పరు ప్రేమాత్మజుడంచు నిన్నెరుగ రబ్బా యేసుక్రీస్తు ప్రభో 59

మ॥ తవ భక్తాళికి మోక్షమిచ్చుకొరకై దారిద్ర్యమైనట్టి మా
నవ రూపంబు ధరించి గ్రామపుర కాంతార ప్రదేశంబులున్
సువిశేషోక్తులు చాటి యద్భుతములం జూపించి యూదాళిచే
నవమానంబగు సిలువపై బడితివయ్యా యేసుక్రీస్తు ప్రభో 60

శా॥ అంధుల్ చంద్రుని బొల్పు గానని గతిన్ అత్యంత దుర్వార గ
ర్వాంధుల్ యూదులు శాంత సాగరుని మోక్షానంద చంద్రున్నినున్
అంధత్వంబున గానలేక తుద నాహా సిలువపై మేకులన్
సంధించుగ్రత జంపిరే పలువురిచ్చున్ యేసుక్రీస్తుప్రభో 61

మ॥ నరలోకామిత పాపాభారములు మేనంబూని యూదాళిచే
మరణావస్థను బొందు ముందు నొక గ్రావంబొద్ద చిత్తాంతరా
తురతన్ బ్రార్థనసేయ నీ తనువునందున్ స్వేదముం గొప్ప నె
త్తురు బొట్లై భువి రాలె నే నవి దలంతున్ యేసుక్రీస్తు ప్రభో 62

శా॥ ఆ గాఢంబగు రాత్రి వేళను ప్రధానాచార్య ప్రేరేపణన్
రాగాంధంబున యూద సైనికులు, మార్గంబిచ్చు యూదాసుతో
వేగన్ గెత్సమనే వనాంతరము బల్మింజొచ్చినిన్ గట్టిరెం
తో గర్వంబున నట్టికాల మెద నెంతున్ యేసుక్రీస్తుప్రభో 63

మ॥ తలపై ముండ్ల కీరిటముంచి కఠినుల్ దండించిరా వెన్క చే
తులు పాదంబులు సిలువ మ్రాని నిడి దుర్ఘోషల్ వెసంగట్టి మే
కులతో గొట్టిరి పార్శ్వమందు గడు మూర్ఖుల్ బల్లెముంగ్రుచ్చి రా
వలి నీ దుఃఖము లెన్న నా తరమె దేవా యేసుక్రీస్తు ప్రభో 64

మ॥ కరపాదానన పార్శ్వ దేశముల రక్తంబంగముం గప్పి సుం
దర బాలారుణ బింబమెట్లుదయ గోత్ర బెక్కునో యట్లక
ల్వరిపై నెత్తెదు మ్రానియందు తవ రూపంబొప్పె భక్తాంబుజా
కరముల్పొంగి ప్రఫుల్లమై ప్రియము లొల్కన్ యేసుక్రీస్తు ప్రభో 65

మ॥ సిలువన్ బ్రాణములంటగట్టి తనువున్ క్షీణంబుగాకుండ చి
ల్లుల భంగిన్ వెస రక్తధార లరికాలుంగేలులం బారగా
తలయున్ వంచి మృతించి వెన్క పునరుత్థానుండవై కూర్మి భ
క్తులకుం జూపిన రూపుజూపగదె నాకున్ యేసుక్రీస్తు ప్రభో 66

శా॥ మూడవనాడు సమాధిలోన దురితంబుల్ డించి స్వాతంత్ర్యముం
గూడం జీవము దాల్చి లేచి మహిమోక్తుల్ బల్కుచున్ శిష్యులుం
జూడం గాయములన్ని జూపి ధృతియుం జొక్కంబుగా నిచ్చిమిన్
జూడన్ మోక్షము కేగినాడవు నిజేచ్ఛన్ యేసుక్రీస్తు ప్రభో 67

శా॥ ఓహో యీ నరులార మీ మదిని నుయ్యోకొండయో యంచు సం
దేహోల్ మానుడి కల్వరీ గిరి దరిం దృష్టించి చూడుండి మీ
యూహాపోహములెల్లబోయి మదిలో నుద్విగ్నముం గల్గుగా
యాహారండని చెల్మితో బిలుతునయ్యా యేసుక్రీస్తు ప్రభో 68

శా॥ రారే మానవులార క్రీస్తుమనలన్ రక్షింపగా వచ్చె నా
భారంబూనె నటంచు భేరిగొట్టుచున్ భాంకారభాంకారభాం
కారారావముతోడ చాటెదను లోకంబందు నీ నామమే
సారంబంచు వచింతు నీ జనులు మెచ్చన్ యేసుక్రీస్తు ప్రభో 69

మ॥ వినుడి మానవులారా చోద్యమిదిగో యిమ్మానుయేలాఖ్యచే
మనతో దేవుడు గూడనుండెనను తద్భాషార్థమా దీర్ఘద
ర్శునివాక్యంబిదె కన్యకాతనయుడై క్షోణీతలింబుట్టె యే
సుని పేరన్ వెసరారె చూతమని బిల్తున్ యేసుక్రీస్తుప్రభో 70

మ॥ అదిగో ముందట ప్రార్థనగిరివరం బాపొంకన్ జూపుమే
రదిగో గెత్సెమనే వనస్థలి ప్రధానాచార్యు నట్టాలకం
బదిగో కల్వరిమెట్ట రక్షకుని దుఃఖావస్థలుం జూడ వె
ళ్లుద మోహోసఖులార రండనుచు బిల్తున్ యేసుక్రీస్తు ప్రభో 71

శా॥ నానాకార్య నితాంత చింతల దినాంతంబౌను ఆ మీదటన్
రేనిద్రించును తెల్లవారుపిదపన్ రేపయ్యె లెమ్మంచు పూ
ర్వానూన క్రియలన్ని చుట్టుకొను నాహో దుఃఖసంసారికిన్
జ్ఞానంబెక్కడ సౌఖ్యమెక్కడ తలంపన్ యేసుక్రీస్తు ప్రభో 72

మ॥ దురితావస్థను బొందు ముందు మది నెంతో మోదముప్పొంగు నా
తరువాతం దుదిలేని దుర్నరక సంతాపోగ్ర దుఃఖంబులుం
బెరసున్ తన్మది కెట్టులన్న సుఫలాపేక్షన్ పతంగంబు వే
గిరమై దీపముజేరి బాధపడు భంగిన్ యేసుక్రీస్తు ప్రభో 73

శా॥ చీమల్ పర్వతమాడు ద్రవ్వి పెకలించేటందుకుం జాలునే
భూమిం బుట్టిన సర్వజీవులును ఫూఃఫూత్కార వాతాహతిన్
ఆ మార్తండ మరీచు లార్పగలవే యట్లంద మర్త్యాళినీ
నామంబార్ప వృథాశ్రమల్ బడుదురన్నా యేసుక్రీస్తు ప్రభో 74

శా॥ తారానీకము లంధకార నిశినిం దర్లింప లేనట్లు నీ
హారోద్య న్మృదుబిందు బృందములు దాహం బార్పలేనట్లు ని
స్సారాచార దరిద్ర దేవతలు మత్స్వాగంతాంతర ధ్వాంతముం
బారం దాపము లారజేయదగ రబ్బా యేసుక్రీస్తు ప్రభో 75

మ॥ మహిలో నంధులు గుడ్డివారలకు త్రోవల్ జూపగా నేర్తురే
యాహిదష్టుల్వెస తేలు గుట్టు నరదుఃఖావస్థలుం దీర్తురే
బహు పాపంబులొనర్చు వేల్పులిలలో పాపాత్ములం బ్రోచుటె
ట్లహహా నీ కృపంగాద నే బ్రతికితయ్యా యేసుక్రీస్తు ప్రభో 76

శా॥ ప్రాణాయామము సల్పినన్ హరి శివబ్రహ్మాది విఘ్నేశ గీ
ర్వాణ శ్రేణులగొల్చినన్ సకల తీర్థ స్నానముల్ చేసినన్
ప్రాణాయాసమెగాక సత్ఫలము గోరంతైన లేదెయ్యెడన్
త్రాణాదాయము నిచ్చు నీ మరణపుణ్యంబే యేసుక్రీస్తుప్రభో 77

శా॥ మేనం బ్రాణములుండె కన్నుగవలున్ వీక్షించె శబ్దార్థముల్
వీనుల్ సోఁకెవినంగ బుద్ధికిది మేలీవస్తువుం గీడనే
న్యూనాధిక్య తెరుంగు తెల్వి దనలోనుండెన్ మనుష్యుండయో
మానున్మన్నను రాతినిం గొలుచునబ్బా యేసుక్రీస్తుప్రభో 78

మ॥ వినుమీ కంటను జూడుమీ యిదిగొ నీ వీ బాలకున్ బ్రోచితే
ఘనమౌ క్రొవ్విన పుంజు పంది యొకటింకన్ గొట్టిపోతిచ్చి నీ
కును సంబ్రమ్ములు చేతుమంచు బలుమ్రొక్కుల్ బొమ్మకుంజేయు మూ
ర్ఖ నర శ్రేణుల జూచినన్ బొడము దుఃఖం యేసుక్రీస్తు ప్రభో 79

మ॥ క్రియకున్ వేగిరమౌను వాక్యములు వాగ్వేగంబుకన్నన్ మనో
దయ భావంబులు చాల వేగమగు తద్భావంబులన్ బాడబా
శ్రయ ముం గుంచముచేసి గొల్చినను దీరంబోవు ఈ నామనం
బయయో నీ దయ రాకనేకమవదయ్యా యేసుక్రీస్తు ప్రభో 80

మ॥ శరవేగంబుకు వాయువేగమునకున్ స్వాంతంబు నత్యంత వే
గిరమౌ దీనిని బట్టి నిల్పుటకు నంగీకారమున్ సేయ ని
ద్దరలోనే మనుజుండు జాలునె భవత్కారుణ్య సారామృతా
కర కాసార తటీలతల్ దొరకలేకన్ యేసుక్రీస్తు ప్రభో 81

శా॥ సారంబౌ కదళీవనాంతర ఫల శ్రద్ధాశనా సక్తమౌ
కీరంబుల్ వెసరేలపండ్లుదిన నంగీకారముల్ సేయునే
నీ రమ్యంబగు ప్రేమ నామరుచి తేనెల్ గ్రోలు సత్క్రైస్తవుల్
క్రూరాచారపు వేల్పులన్వేదుక బోరే యేసుక్రీస్తు ప్రభో 82

శా॥ బావాంతుర్ముఖులైన క్రైస్తవులు సద్భక్తిన్ భవత్పాదరా
జీవంబుల్ తమ జీవనంబులని సంసేవించి యానంద పా
రావారాంతర మగ్నులై సుఖము లారన్ మోక్ష సామ్రాజ్యముం
జూపన్ నేర్తురు నీ కృపాగరిమనుంచో యేసుక్రీస్తు ప్రభో 83

మ॥ కులగోత్రంబులు వీడనేమి పరుషోక్తుల్ మానగానేమి యా
శలు తెగగొయ్యనేమి దుర్విషయముల్ చాలించగా నేమి ని
శ్చల విశ్వాస భవత్పదార్పిత మనస్సంధానముల్ లేని క్రీ
స్తులు పేరేగద క్రీస్తులన్న ఫలమేదో యేసుక్రీస్తు ప్రభో 84

మ॥ మనసే భక్తికి మూలమంచు తమ సన్మార్గంబులన్నమ్మి నీ
కనికారం బెద నూనలేక యశకాంక్షన్ సత్క్రియల్ చేసి నూ
తన జన్మంబెదలేని క్రైస్తవులు తథ్యం బెన్నగా మోక్ష రా
జ్య నివాసంబునజేర సంశయములయ్యా యేసుక్రీస్తు ప్రభో 85

శా॥ శాకాలన్నము లేక నాకలిని దీర్చం జాలునే సత్క్రియా
నీ కంబాకరణిన్ మనోదురిత వహ్నిజ్వాల లెట్లార్చున
స్తోకంబైన భవత్కాటాక్ష రసముం జుర్రంగ లేకున్న న
త్పాకంబుందెలలేని తెడ్డుగతి వ్యర్థం యేసుక్రీస్తు ప్రభో 86

శా॥ మానుష్యుల్ నను వానని మోముగనగా మా కిష్టమున్ లేదు పో
పోనిమ్మంచు దిరస్కరించుటలు నీవు న్వింటివేత్వత్పదా
ధీనుండ న్మమ చిత్తవృత్తిగను నీ దృగ్దృష్టియుంగల్గనా
కూనంబేమిటి లేదు భీతి నరులందో యేసుక్రీస్తు ప్రభో 87

మ॥ తలలాడించుచు వెక్కిరించుచు మహా దర్పోక్తులుంబల్కి చే
తుల దాటించుచు దంతము ల్గొరుకుచుం దూషించచి మర్త్యాళినా
ఖల చారిత్రము లెంచువేళ వినరాకం జూడక న్నీవు వా
రలతో వేరొక భంగి నుంటదగునయ్యా యేసుక్రీస్తు ప్రభో 88

మ॥ విడిచెం దేవుడు వీని నిప్పుడు మనోవిజ్ఞానముం బోయి వీ
రడియయ్యెం జెడె నింకనేమిటని మర్త్య శ్రేణి యొండొండుతో
నుడువన్ సాగెడువేళ తజ్జనులకు న్నోర్మ్యాయనన్నట్టి నీ
యడుగుల్ ప్రాపుగ నిచ్చినావు దయనయ్యా యేసుక్రీస్తు ప్రభో 89

మ॥ తనలోనున్న వివేక మెంచి తనువుం దాగాక నున్నట్లు రెం
టిని వేర్వేరుగ జూచువానికిగదా డెందంబు చందంబు ద
న్మనసాంతర్గత పాపవర్తనము గానవ్వచ్చు నా వెన్క ని
ల్చును జ్ఞానం బటమీద ముక్తి పథి గాంచున్ యేసుక్రీస్తు ప్రభో 90

మ॥ ఇది నా సొమ్మిది నా పొలంబు సరిహద్దీ భూమి నాదిందు గో
ష్పదమంతైనను గుడ్డి గవ్వయిన నివ్వంజాలనే నేరికం
చు దురాశంబడి జచ్చువేళను మనుష్యం డక్కటా సర్వమున్
వదులున్ ఎక్కడి దక్కడే నిలుచు దేవా యేసుక్రీస్తు ప్రభో 91

మ॥ జనీ గర్భతలంబునుంచి నరుడుం జన్మించు నిర్వస్త్రుడై
వెనుకం గొన్ని దినంబులుండి చనిపోయేవేళ నిర్వస్త్రుడై
చనుచున్నాడిది యేమి చోద్యమిలలో సంపాద్యమేదైన వెం
టను బోదాయెను గాలిమూటలివి చూడన్ యేసుక్రీస్తు ప్రభో 92

మ॥ కలుముల్లేములు జచ్చు నావలను లెక్కన్ రావురోగాంగు డెం
గిలి భక్షించెడి బీద లాజరుడు ముక్తి ప్రాప్తుడై మించె ని
చ్చల భోగించు ధనాఢ్యుడున్నరక శిక్షాపాత్రుడయ్యెన్ సుఖం
బులు దుఃఖంబులు నెల్లవారికిని తావుల్ యేసుక్రీస్తు ప్రభో 93

శా॥ కోటిన్ కోటి గుణించునంత ధనమున్ కోశంబులై యున్నపల్
పోటొక్కింతయూ మాన్పజాలునె మనోమోదం బులందిచ్చునే
తేటౌ నీ కృపగల్గు భక్తుడు దరిద్రుండైన హృత్కామఝం
ఝుటా యత్తుడుగాక నెమ్మిగొను ప్రజ్ఞనన్ యేసుక్రీస్తు ప్రభో 94

మ॥ దగలావై యొకరుండు యెండబడి పంతంబోవుచో ముందటన్
మృగతృష్ణల్గని నీరమాసను వెసం బోయచ్చుటం బ్రాణముల్
దెగుభంగిం ధనలోబులిండ్ల కడకుం ధీనుల్ ధనాపేక్షచే
మిగులం బోవుటలెల్ల నిష్ఫలము లుర్విన్ యేసుక్రీస్తు ప్రభో 95

95. లోకాంత్యంబున న్యాయతీర్పు దినమున్ రూఢంబుగా వచ్చెనన్
బాకానాదము సేయు దూత ధ్వనిచేక్ష్మాకంపమై సర్వమ
ర్త్యాకారంబులు లేచు నక్షయములై యత్యంత శీఘ్రంబులో
నాకాలంపు భయంబు చెప్పదరమయ్యా యేసుక్రీస్తు ప్రభో 96

మ॥ ప్రళయార్కుండిదె వచ్చెనో యనుచు దుష్పాపుల్ బయం బందగా
కళలెల్లంగొను చంద్రుడో యనుచు భక్తశ్రేణి మోదింపగా
తళుకుల్ దేరెడి నీ మొగంబు జగదంతంబందు గన్పట్టనౌ
భళియంచు న్వినుతింతు నే నపుడు దేవా యేసుక్రీస్తు ప్రభో 97

శా॥ పాపుల్ నారకభూరి దుఃఖములకుం బాల్పొందగా భక్తులుం
గాపాడంబడి మోక్షరాజ్య చిర సౌఖ్యంబందగా న్యాయమి
ర్వైపుల్ తీరిచి పాపమృత్యువుల దుర్వ్యాపారమున్మాన్పి నీ
వాపై శాశ్వతరాజు వౌదువుగదయ్యా యేసుక్రీస్తు ప్రభో 98

శా॥ నీరంధ్రాంధత మిశ్రగంధక యుతాగ్ని జ్వాలకల్లోలమా
లా రావంబును దుఃఖ ధూమ్రపటు ధూమాత్యుగ్ర పైశాచకా
ధారాంతర్గృహమైన నారక సముద్రంబందు నన్ముంచకన్
కారుణ్యంబున నా కొసంగితివి మోక్షమ్ యేసుక్రీస్తు ప్రభో 99

మ॥ జగమంతంబయిపోయి నన్మలినమై చంద్రార్క తారాళితో
గగనంబుం దెగిపోయినం జలధి యింకం బారినం భూమితో
నగమూల్గూలిన సర్వముంజెడిన నీ నామంబు నిల్చున్ నవీ
న గతిన్ శాశ్వత వైభవోన్నతుల నయ్యా యేసుక్రీస్తు ప్రభో 100

కII కరుణా నిధియగు క్రీస్తుని
చరణంబులు శరణు గొనుచు సమ్మతితోనే
నరులీ శతకము జదివిన
నిరతంబా ప్రభువొసంగు నిజమగు సుఖముల్ II

కII పదునెనిమిది నూరులు నలు
వది యైదవ వత్సరంపు ప్రభు శకమున సెం
పొదవెడు సెప్టెంబరు నెల
నిది రచితంబయ్యె క్రీస్తు యేసుని కరుణన్ II

కII క్రమముగా చౌధరి పురుషో
త్తమ దాసునిచేత కల్పితంబగు దీనిన్
సుమతిం జదివిన వారికి
ప్రముద మొసగు యేసుక్రీస్తు ప్రభు శతకమిలన్ II